# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అర్హులందరికీ పెన్షన్ అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ఆంధ్రప్రదేశ్ ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చటమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- రానున్న 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని పించన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పించన్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 63,61,380 మంది లబ్ధిదారులకు పించన్లను అందజేసేందుకు 2,746 కోట్ల రూపాయలు విడుదల చేశామని, కొత్తగా 7 వేల 872 మందికి స్పౌజ్ పించన్లను మంజూరు చేశామని చెప్పారు. రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రతనాల సీమగా మారుస్తామన్నారు. డ్వాక్రా సంఘాలు ప్రారంభించి, మహిళలను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేశామన్నారు. అర్హులందరికీ పించన్లను అందించాలన్నది తమ ప్రభుత్వ ఉద్ధేశ్యమని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) క్యాన్సర్ చికిత్సా కేంద్రంలో సుమారు 42 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను, స్క్రీనింగ్ యంత్రాలను ఆయన ఈరోజు

లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేజీహెచ్ తో పాటు రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని, వైద్యులను, సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించేందుకు గాను 45 కోట్ల రూపాయలతో లీనియర్ యాక్సిలరేటర్ హెచ్.డి.ఆర్. బ్రాకీథెరపీ, సీటీ సిమ్యులేటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటి ద్వారా సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలలో సేవలు అందుతాయని మంత్రి వివరించారు.

========================

రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కె. కృష్ణాపురంలో ఈరోజు ఆయన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్రానికి అనేక పెట్టుబడులను తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

విరామం

========================

రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈరోజు పర్యటించిన మంత్రి.. ఉల్లి రైతులతో మాట్లాడారు. గత వారం రోజులుగా ఉల్లికి గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళామని చెప్పారు. క్వింటాల్ ఉల్లికి 12 వందల రూపాయలు ధర నిర్ణయించి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రాష్ట్రంలోని రైతు బజార్ లకు సరఫరా చేస్తున్నామని మంత్రి వివరించారు.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. విశాఖలోని బీచ్ రోడ్ లో నోవటెల్ హోటల్ నందు రేపు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈస్ట్ కోస్ట్ మారిటైం అండ్ లాజిస్టిక్ సమ్మిట్ లో పాల్గొంటారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు.

========================

గోదావరి పుష్కరాలను.. కుంభమేళా తరహాలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. `సారధ్యం` పేరుతో చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు రాజమహేంద్రవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా  చాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొని పలు విషయాలపై ప్రస్తావించారు. గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సహకారం అందించనుందన్నారు. పుష్కరాల నిర్వాహణకు సంబంధించి ఇప్పటికే కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సమావేశం నిర్వహించారని పీవీఎన్ మాధవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతుండటంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కూరెళ్ళ గోపీనాథ్ తెలిపారు. గత నెల 30వ తేదీ రాత్రి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి, సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామని, సెప్టెంబర్ 6

వరకు రోజువారీగా  సుమారు 12 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తామని చెప్పారు. నది తీర ప్రాంత ప్రజలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, తీర ప్రాంతాల్లో నివసించే వారికి చరవాణి ద్వారా గంట గంటకూ వరద సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

========================

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలన్న ఐబీఎం సంస్థ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయాలు, అంకుర సంస్థలు, పరిశ్రమల పరిశోధన కార్యక్రమాలకు ప్రయోజనం చేకూర్చేలా అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేయడానికి CRDA 50 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు.

========================

ఈశాన్య బంగాళాఖాతం ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ అధికారి ఎం.వెంకట్రావు వెల్లడించారు. దీని ఫలితంగా రాష్ట్రంలో అనేక చోట్ల రానున్నరెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ఆయన  తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================
========================